సాక్షి కామారెడ్డి

మంగళవారం। 30। ఏప్రిల్। 2024



సమస్యలు లేకుండా చూడాలి

తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు.

- 8లో ▸



బీజేపీతోనే పేదలకు లబ్ధి

బీజేపీ అధికారంలో ఉంటేనే పేదలకు లబ్ధి చేకూరుతుందని మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
44.0 /25.0

ఉదయంనుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

మోదీ సభపై ఆశలు

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేయాలని ఉవ్విళ్లూరుతున్న కమలదళం.. మోదీ సభపై ఆశలు పెట్టుకుంది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు మెదక్ జిల్లాలోని అల్లాదుర్గంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయడంపై దృష్టి సారించింది. జిల్లానుంచి భారీగా జనాన్ని సమీకరించి సత్తా చాటాలని పార్టీ నాయకులు భావిస్తున్నారు. – సాక్షి, కామారెడ్డి



సభా వేదిక వద్ద ఏర్పాట్లు

- భారీ జన సమీకరణకు బీజేపీ ఏర్పాట్లు
- నేడు అల్లాదుర్గంలో బహిరంగ సభ

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ ఇప్పటివరకు గెలవలేదు. గతంలో జరిగిన ఎన్నికలలో పెద్దగా ప్రభావం చూపలేదు. అయితే ఈసారి ఎన్నికలను ఆ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పార్లమెంట్ ఎన్నికలలో గెలిచి నియోజకవర్గంలో పాగా వేయాలని ఆ పార్టీ నాయకులు పావులు కదుపుతున్నారు. సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌ను పార్టీలో చేర్చుకుని టికెట్టు ఇచ్చిన బీజేపీ.. చేరికలపైనా ఫోకస్ చేసింది. దీంతో పలువురు నేతలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. నోటిఫికేషన్‌కు ముందే పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేసే ప్రక్రియ ప్రారంభించిన కాషాయ పార్టీ.. జహీరాబాద్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి బాధ్యతలు అప్పగించింది. ఆయన నియోజకవర్గం అంతటా తిరుగుతూ శ్రేణులను సన్నద్ధం చేస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతారతోపాటు నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, ఇతర నేతలు సైతం చురుకుగా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇంటింటికి వెళ్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరిస్తూ బీజేపీకి ఓటు వేయాలని కోరుతున్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం కల నెరవేరడానికి మోదీనే కారణమన్న అంశాన్ని బీజేపీ శ్రేణులు జనంలోకి తీసుకువెళ్లాయి.

‘జనసభ’కు సర్వం సిద్ధం

నరేంద్ర మోదీ చరిష్మా కలిసి వస్తుందని భావిస్తున్న బీజేపీ నేతలు.. ప్రధాని సభకు ప్లాన్ చేశారు. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి అల్లాదుర్గంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే సభలో మోదీ పాల్గొననున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం శ్రమిస్తున్న బీజేపీ శ్రేణులు ఈ సభపై భారీ ఆశలు పెట్టుకున్నాయి. కాంగ్రెస్‌కు పట్టున్న ప్రాంతంలో మోదీ సభ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలో పట్టు సాధించవచ్చని ఆశిస్తున్నారు. మోదీ సభతో ఊపు వస్తుందని పార్టీ నేతలు భావిస్తున్నారు. దీంతో జిల్లాలోని అన్ని ప్రాంతాలనుంచి భారీగా జనాన్ని తరలించడానికి బీజేపీ నేతలు ఏర్పాట్లు చేశారు. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల మధ్యలో నిర్వహించే సభకు 1.50 లక్షల జన సమీకరణ చేస్తున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు.

800 మందితో బందోబస్తు

మెదక్‌జోన్/అల్లాదుర్గం(మెదక్): ప్రధాని మోదీ బహిరంగ సభకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మెదక్ జిల్లాతో పాటు సిరిసిల్ల, సిద్దిపేట, నిర్మల్ జిల్లాల నుంచి సుమారు 800 మంది పోలీసులతో భద్రత కల్పించారు. వీరితోపాటు సెంట్రల్ ఫోర్స్, ఇంటెలిజెన్స్ విభాగం పర్యవేక్షణలో సభ జరగనుంది. సభాస్థలిని సోమవారం సాయంత్రం మెదక్ అదనపు కలెక్టర్ రమేశ్ పరిశీలించి, సిబ్బందికి సూచనలు ఇచ్చారు.



సభా ప్రాంగణంలో మోదీ, పాటిల్ కటౌట్లు

న్యూస్‌రీల్

‘కొనుగోళ్లను వేగవంతం చేయండి’



నిజాంసాగర్: ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం బంజపల్లి, గోర్గల్ గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా చూడాలన్నారు. రైతులకు కావాల్సిన అన్ని రకాల వసతులు కల్పించాలని సూచించారు. ఆయన వెంట సొసైటీ సీఈవో సంగమేశ్వర్‌గౌడ్, ఆర్‌ఐ అంజయ్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ కో-ఇన్‌చార్జీగా మదన్‌మోహన్‌రావు



ఎల్లారెడ్డి: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఇన్‌చార్జీగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ ఉత్తర్వులు జారీ చేశారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

నేడు పదో తరగతి పరీక్ష ఫలితాలు

నిజామాబాద్‌అర్బన్: ఎస్సెస్సీ వార్షిక పరీక్షల ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి. పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు కొనసాగాయి. జిల్లావ్యాప్తంగా 22,194 మంది పరీక్షలు రాశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు పరీక్ష ఫలితాలు విడుదల కానున్నాయి.

‘పంద్రాగస్టులోగా రుణమాఫీ చేస్తాం’



మాట్లాడుతున్న షబ్బీర్ అలీ, పక్కన సురేశ్ షెట్కార్

దోమకొండ: పంట రుణాలను ఆగస్టు 15వ తేదీలోగా మాఫీ చేస్తామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన 90 రోజుల్లోనే 5 గ్యారంటీలను అమలు చేశామన్నారు. జహీరాబాద్‌లో సురేశ్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ బాపురెడ్డితోపాటు వివిధ కుల సంఘాల ప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, పార్టీ మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, కౌన్సిలర్ రాజేశ్వర్, నాయకులు ఐరేని నర్సయ్య, నాగరాజ్ రెడ్డి, నర్సారెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్, అంజలి, స్వామి, శ్రీకాంత్, రామస్వామిగౌడ్, సీతారం మధు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లెక్క తేలింది

- పార్లమెంట్ ఎన్నికల బరిలో 19 మంది
- ముగిసిన ఉపసంహరణ గడువు
- నేటినుంచి హోరెత్తనున్న ప్రచారం

కామారెడ్డి క్రైం: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మరో కీలక ఘట్టం పూర్తయ్యింది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో బరిలో మిగిలిన అభ్యర్థుల లెక్క తేలింది. జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో సోమవారం ఏడుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 19 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. జహీరాబాద్ స్థానంలో మొత్తం 40 మంది అభ్యర్థులు, 64 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో 14 మంది నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. సోమవారం ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో బరిలో 19 మంది మిగిలారు. ప్రధాన పార్టీలనుంచి బీజేపీ అభ్యర్థిగా బీబీ పాటిల్, కాంగ్రెస్ అభ్యర్థిగా సురేశ్ షెట్కార్, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గాలి అనిల్ కుమార్ బరిలో ఉన్నారు. కొత్త బలిజ బస్వరాజ్, గుర్రపు మచ్చేందర్, మణి చావగని, దేవ శిఖామణి, మాలెపు మోహన్‌రెడ్డి, బాబు దుర్గయ్య వివిధ పార్టీల నుంచి పోటీ చేస్తుండగా.. తలారి అశోక్, కమ్మరి ఆనందీశ్వర్, జైపాల్ నాయక్, మొహద్ సద్దాం, మహదేవ్ స్వామి, బిరాదర్ మారుతీరావు, యాకూబ్ షరీఫ్, రమేష్ సజ్జాపూర్, ఎస్.రాజు, సత్యనారాయణ గౌడ్ కోవూరి స్వతంత్ర అభ్యర్థులుగా అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఇక ప్రచారంపై దృష్టి..

నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో అభ్యర్థులు ఇక పూర్తిస్థాయిలో ప్రచారంపై దృష్టి సారించనున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీలు కార్యకర్తల సమావేశాలతో శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేశాయి. అభ్యర్థులతోపాటు ఆయా పార్టీల నాయకులు రోజూ ఊళ్లను చుట్టేస్తూ ఓటర్లను కలుస్తున్నారు. మంగళవారం నుంచి స్వతంత్ర అభ్యర్థులూ ప్రచారాన్ని మొదలుపెట్టనున్నారు.

నిజామాబాద్ బరిలో 29 మంది..

సుభాష్‌నగర్(నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. మొత్తం 42 మంది నామినేషన్లు వేశారు. పరిశీలనలో 10 నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. సోమవారం ముగ్గురు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ప్రధాన పార్టీలలో బీజేపీ నుంచి అర్వింద్ ధర్మపురి, కాంగ్రెస్‌నుంచి జీవన్‌రెడ్డి తాటిపర్తి, బీఆర్‌ఎస్‌నుంచి బాజిరెడ్డి గోవర్ధన్ బరిలో ఉన్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

కామారెడ్డి అర్బన్: జిల్లాలో బుధవారం నుంచి నెలరోజుల పాటు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రామారెడ్డిలో ఫుట్‌బాల్, కామారెడ్డి, దోమకొండ మండలం అంబారిపేటలలో అథ్లెటిక్స్, జుక్కల్ మండలం ఖండేబల్లూర్‌లో రెజ్లింగ్, ఎల్లారెడ్డి మండలం మత్తమల్‌లో హ్యాండ్‌బాల్, బీబీపేట మండలం మాందాపూర్‌లో సాఫ్ట్‌బాల్, బాన్సువాడలో కబడ్డీ, తాడ్వాయి, బ్రాహ్మణపల్లి, గాంధారి మండలం పోతంగల్, నాగిరెడ్డిపేట మండలం బొల్లారం గ్రామాల్లో వాలీబాల్ శిక్షణ శిబిరాలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందని, 14 ఏళ్లలోపు బాలబాలికలు ఈ క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అథ్లెటిక్స్‌లో..

జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో బుధవారం నుంచి నెలరోజుల పాటు అథ్లెటిక్స్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తిగల 14 ఏళ్లలోపు బాలబాలికలు పేర్లు నమోదు చేయించుకోవాలని, ఇతర వివరాలకు 76608 68926 నంబర్‌లో సంప్రదించాలని అథ్లెటిక్స్ కోచ్ శివాగౌడ్ సూచించారు.

ఉమ్మడి జిల్లా ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ ఎన్నిక


డాక్టర్ శ్రీనివాస్, అధ్యక్షుడు

కామారెడ్డి టౌన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా తెలంగాణ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కె.బన్సీలాల్, కోశాధికారిగా రాజుగౌడ్, ఉపాధ్యక్షులుగా ఎస్.జ్యోతి, ఎస్.కృష్ణ, ఈ.రవీంద్ర మోహన్, సహాయ కార్యదర్శులుగా ఎం.గౌతమి, యు.వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులుగా కిషోర్‌గౌడ్, వసంత్‌కుమార్, మధుసూదన్ ఎన్నికై నట్లు రిటర్నింగ్ అధికారి డాక్టర్ జి.సుజాత ప్రకటించారు.

కూచిపూడిలో శ్రీనిధికి జాతీయస్థాయి అవార్డు



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని దేవునిపల్లి మధురానగర్‌కు చెందిన కాసం శ్రీనిధి గోవాలో స్నేహ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్‌లో కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి 'నేషనల్ ఐకాన్' అవార్డును అందుకుంది. గోవా మడ్‌గావ్ రవీంద్రభారతిలో ఆల్ ఆర్ట్ ఫామ్స్ పేరిట ఈనెల 26 నుంచి 29 వరకు నృత్యపోటీలు నిర్వహించగా, వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ ప్రదర్శనలు ఇచ్చారు. శ్రీనిధి కూచిపూడిలో ప్రతిభను కనబర్చింది. నిజామాబాద్ నటరాజ రామకృష్ణ కళాక్షేత్రం నిర్వాహకులు రచ్చ నరేశ్ వద్ద శ్రీనిధి నృత్య శిక్షణ పొందింది.

పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరించాలి

కామారెడ్డి రూరల్ : జిల్లాలో బీడీ ఈపీఎఫ్ పెన్షన్‌దార్ల సమస్యలను పీఎఫ్ అధికారులు సత్వరమే పరిష్కరించాలని నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వంది సత్యం ఈపీఎఫ్ కమిషనర్ సుందర శివరావుకు విన్నవించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వాణి నవశక్తి బీడీ కంపెనీలో జరిగిన సమావేశంలో కమిషనర్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో మూడురోజుల జైలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఓ వ్యక్తికి న్యాయమూర్తి మూడురోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. వాహనాలను తనిఖీ చేస్తుండగా మెదక్‌కు చెందిన ఓ వ్యక్తి మద్యం సేవించి బైక్ నడుపుతూ పట్టుబడ్డాడని తెలిపారు. సోమవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ప్రతాప్ అతడిని మూడు రోజుల జైలు శిక్ష విధించారన్నారు.

తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి

- అవసరమైన పనులు చేపట్టండి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్


వీసీలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ నుంచి ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. గ్రామాల్లో పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలన్నారు. అవసరం మేరకు నూతన పైప్‌లైన్‌లు, ట్యాంకుల నిర్మాణం, నీటి కుళాయి కనెక్షన్లు, నూతన బోర్‌వెల్స్ తవ్వకాలు, పంపుసెట్ల మరమ్మతులు తదితర పనులు చేపట్టాలని సూచించారు. ఎంపీడీవోలు క్షేత్ర స్థాయిలో నీటి సరఫరాను పర్యవేక్షించాలన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సాగునీటి సమస్య పరిష్కారానికి రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలన్నారు. పొలాలలో 8 అడుగుల ఫాంపాండ్స్ ఏర్పాటు చేసుకొని చేపల పెంపకం చేపట్టాలని, గట్ల వెంట టేకు చెట్లు పెంచుకోవాలని సూచించారు. ఉపాధి కూలీలకు వడదెబ్బ తగలకుండా నీడ సౌకర్యం కల్పించాలని, మంచి నీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 1000 పాఠశాలల్లో వివిధ రకాల పనులు చేపట్టడానికి రూ.10 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 196 పాఠశాలలో పనులపై అంచనాలు రూపొందించి, 25 శాతం నిధులను అడ్వాన్స్ రూపంలో చెల్లించామన్నారు. మిగిలిన పాఠశాలల్లో కూడా చేపట్టాల్సిన పనులకు సంబంధించి అంచనాలు రూపొందించి బుధవారంలోగా నివేదికలు సమర్పించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో చందర్ నాయక్, డీపీవో శ్రీనివాస్, డీఈవో రాజు, మిషన్ భగీరథ ఈఈ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: రక్తదానం ప్రాణదానంతో సమానమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. ఆరోగ్యవంతులైన వారు రక్తదానానికి ముందుకురావాలన్నారు. వైద్యారోగ్య, పశు సంవర్ధక, రెడ్‌క్రాస్ సంస్థల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. ఉద్యోగులు సైతం షెడ్యూల్ ప్రకారం రక్తదానం చేయడానికి ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఈ శిబిరంలో 93 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, జిల్లా పశు సంవర్ధక అధికారి సింహారావు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, కార్యదర్శులు రఘుకుమార్, నర్సింహం, వైద్యులు సంజయ్, శ్రీనివాస్, దేవేందర్, శ్రేష, పోచయ్య, కిషోర్, ప్రోగ్రాం అధికారి రాధిక, డీపీఎం సుధాకర్, గోపాల మిత్రలు కృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమష్టికృషితోనే ఉత్తమ ఫలితాలు


బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బందిని సన్మానిస్తున్న చైర్మన్ రమేశ్‌రెడ్డి, సీఈవో నాగభూషణం వందే

- ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి
- బ్రాంచ్ మేనేజర్లకు సన్మానం

సుభాష్‌నగర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో గతేడాది కంటే ఈ మార్చి నాటికి డిపాజిట్లలో పెరుగుదల, ఎన్‌పీఏలో తగ్గింపు బ్యాంకు ఉద్యోగుల సమష్టికృషితోనే సాధ్యమైందని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని నిజామాబాద్ సహకార కేంద్ర బ్యాంకులో డిపాజిట్లపై అధిక వడ్డీ 7.35శాతం ఉత్తమ ఫలితాలు అందించిన బ్రాంచ్ మేనేజర్లకు సన్మానం చేశారు. ఈసందర్భంగా 12 మంది బ్రాంచ్ మేనేజర్లను సన్మానించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధిలో పాలకవర్గం, ఉద్యోగులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఎన్‌పీఏ తగ్గింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఓటీఎస్ విధానాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించి చైతన్యపర్చాలని సూచించారు. అంతకుముందు లైజనింగ్ అండ్ మార్కెటింగ్ హబ్, రికవరీ అండ్ సెక్యూరిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్‌సెల్‌ను ఆవిష్కరించారు. బ్యాంకు మార్కెట్ షేర్ పెరిగేందుకు అవసరమైన సూచనలను సీఈవో నాగభూషణం వందే వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు సీనియర్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్య కార్యాచరణ పేరుతో రాజకీయం

ఆర్మూర్: ఐక్య కార్యాచరణ పేరుతో గల్ఫ్ కార్మికుల సమస్యను కొన్ని సంఘాలు రాజకీయం చేస్తున్నాయని ప్రవాస భారతీయుల సంక్షేమ, హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు ఆరోపించారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గల్ఫ్ బాధితుల పక్షాన 15 సంవత్సరాలుగా తాము ఉద్యమాలు చేస్తున్నామన్నారు. నాడు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు గల్ఫ్ కార్మికుల పక్షాన ఏ ఒక్క చర్య చేపట్టలేదన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న జీవన్‌రెడ్డి మంత్రిగా పనిచేసిన సమయంలో ఏనాడూ గల్ఫ్ బాధితుల పక్షాన నిలబడలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం సైతం గల్ఫ్ కార్మికుల సమస్యను నిర్లక్ష్యం చేసిందన్నారు. రైతులు, గల్ఫ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రపంచ వ్యాప్తంగా దేశ గౌరవాన్ని పెంచిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీని మూడో పర్యాయం గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో ప్రవాస భారతీయుల సంక్షేమ, హక్కుల వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

అపూర్వం.. పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఇంటర్ 1988 బ్యాచ్ విద్యార్థులు

36ఏళ్ల తర్వాత కలుసుకున్న ఆ పూర్వ విద్యార్థుల ఆనందం అంతాఇంతా కాదు.. 1988లో కామారెడ్డి పట్టణంలోని జీవీఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం పాల్వంచ మండలంలోని భవానిపేట శివారులోని ఓ ఫాంహౌజ్‌లో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వారి పిల్లల చదువులు, ఉద్యోగాల గురించి చర్చించుకున్నారు. - మాచారెడ్డి

కొడుకు అప్పులపాలయ్యాడని ఆత్మహత్య

బాల్కొండ: కొడుకు అప్పుల పాలయ్యాడని మనస్తాపానికి గురైన వృద్ధురాలు ఎస్సారెస్పీ వరద కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్సై శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కిసాన్‌నగర్‌కు చెందిన పాతకాల సాయమ్మ(70) తన కుమారుడు ప్రవీణ్ అప్పులపాలయ్యాడని మదనపడుతుండేది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి బయటికి వెళ్లి వరదకాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కుటుంబ సభ్యుల మరణాలను తట్టుకోలేక..

బాల్కొండ: అనారోగ్యం కారణంగా భర్త, కుమారుడు, కుమార్తె వరుసగా చనిపోవడాన్ని తట్టుకోలేక ముప్కాల్‌కు చెందిన రుక్మాబాయి(59) ఆత్మహత్య చేసుకుందని ఎస్సై భాస్కరాచారి తెలిపారు. కుటుంబ సభ్యుల మరణాలతో తీవ్రమానసిక ఒత్తిడికి లోనైన రుక్మాబాయి కోడలు వద్ద ఉంటోంది. మానసిక ఒత్తిడి, కీళ్ల నొప్పుల కారణంగా సోమవారం ఉదయం ముప్కాల్‌లోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది.

ఆర్థిక భారాన్ని మోయలేక..

బోధన్‌రూరల్: ఆర్థికభారాన్ని మోయలేక మండలంలోని కల్దుర్కికి చెందిన బి.అనురాధ(30) ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. భర్త పనిచేయకపోవడం, మద్యానికి బానిసకావడంతో అనురాధ కుటుంబ భారాన్ని మోస్తోంది. ఈ క్రమంలో ఆర్థికభారాన్ని మోయలేక మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానసికంగా కుంగి..

డొంకేశ్వర్(ఆర్మూర్): భర్త మరణంతో మానసికంగా కుంగిపోయి మండలంలోని నూత్‌పల్లికి చెందిన మంగ్లారం ఉమ(26) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. ఏడేళ్ల క్రితం ఉమకు సురేశ్‌తో పెళ్లికాగా, కూతురు పుట్టిన కొన్నినెలలకే భర్త మరణించాడు. ఈ క్రమంలో మానసికంగా కుంగిపోయిన ఉమ ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసైన వ్యక్తి..

బోధన్‌రూరల్: సాలూర మండల కేంద్రానికి చెందిన మహాదేవ్ చంద్రకాంత్ గిరి (26) మద్యానికి బానిసై చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. కొంతకాలంగా సిద్దిపేటలో ఉంటున్న చంద్రకాంత్ గిరి ఈ నెల 26న సాలూరకు వచ్చి మరుసటి రోజు గ్రామ శివారులోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలుకు ఎదురెళ్లి యువకుడి ..

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో ఆదివారం రాత్రి రైలుకు ఎదురెళ్లి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని, మృతుడి ఒంటిపై బ్లూ కలర్ జీన్స్, వైట్ షర్ట్ ఉన్నాయన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీస్‌స్టేషన్‌లో లేదా 87126 58591 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్రైం కార్నర్

మలేషియాలో కోటాల్‌పల్లివాసి మృతి


అకుల రమేశ్(ఫైల్)

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం కొటాల్‌పల్లికి చెందిన ఆకుల రమేశ్(45) గుండెపోటుతో మలేషియాలో మృతి చెందాడు. బతుకుదెరువుకోసం రమేశ్ గత 20 ఏళ్లుగా గల్ఫ్ దేశాలకు వెళ్తున్నాడు. కొద్దిరోజులపాటు గ్రామంలోనే ఉండి వ్యవసాయ పనులు చేసిన రమేశ్.. వారం రోజుల క్రితమే మలేషియాకు వెళ్లాడు. అక్కడ పరిస్థితి బాగాలేకపోవడంతో మలేషియాలోనే ఉంటున్న గ్రామానికి చెందిన బాలకృష్ణతో కలిసి స్వగ్రామానికి వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. శనివారం ఇండియాకు బయల్దేరిన రమేశ్ ఎయిర్‌పోర్టులో గుండెపోటుతో మృతి చెందాడు. బాలకృష్ణ ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కువైట్‌లో కలిగోట్ వాసి ఆత్మహత్య


అముదాల హరీశ్ (ఫైల్)

జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగోట్‌కు చెందిన అముదాల హరీశ్‌గౌడ్(29) కువైట్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. బతుకుదెరువు కోసం రెండున్నరేళ్ల క్రితం కువైట్‌కు వెళ్లిన హరీశ్‌గౌడ్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా మార్చి 22న ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సమీప బంధువైన సత్యంగౌడ్, దుబాయ్ జీడబ్ల్యూఏసీ అధ్యక్షుడు రవి, కువైట్ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, మాజీ అధ్యక్షుడు వాజిద్ సహకారంతో హరీశ్ మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించారు. సోమవారం హరీశ్ అంత్యక్రియలను గ్రామంలో నిర్వహించారు.

అడవి పందులను బైక్ ఢీకొని ఒకరి మృతి


గంగారాం (ఫైల్)

మాచారెడ్డి: అడవి పందులను బైక్ ఢీకొట్టిన ఘటనలో మండలంలోని సోమారంపేటకు చెందిన నునావత్ గంగారాం(42) అనే వ్యక్తి మృతి చెందాడు. గంగారాం గ్రామానికి చెందిన అమర్‌సింగ్‌తో కలిసి ఆదివారం రాత్రి బైక్‌పై సోమారంపేటకు వెళ్తుండగా అడవి పందులు అడ్డువచ్చాయి. ఈ ఘటనలో గంగారాం తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం కామారెడ్డికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనలో అమర్‌సింగ్ చేయి విరిగింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

సైకిల్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో..

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతంగల్ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన హరిశంకర్ మృతి చెందాడు. పోతంగల్ మండల శివారులోని మంజీర నది రెండో బ్రిడ్జి సమీపంలో హరిశంకర్ సైకిల్‌పై వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. సీఐ జయేశ్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడిని మహారాష్ట్రలోని దెగ్లూర్ తాలుకా నరేంగల్ గ్రామానికి చెందిన హరిశంకర్‌గా గుర్తించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోధన్‌లో పోలీసు కవాతు



బోధన్‌టౌన్(బోధన్): పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించే చర్యల్లో భాగంగా పోలీసులు, సీఆర్‌పీఎస్ బృందాలు సోమవారం పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్ ఆజాంగంజ్, బీటీ నగర్, ఉద్మీర్‌గల్లీ, రెంజల్ బేస్, పాత బస్టాండ్, శక్కర్‌నగర్ చౌరస్తా మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించామన్నారు. పట్టణ సీఐ వీరయ్య, రూరల సీఐ నరేశ్‌తోపాటు పోలీసు సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ బృందాలు పాల్గొన్నాయి.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గల చెరువులో చేపలవేటకు వెళ్లిన మీసాల సాయిలు(54) ప్రమాదవశాత్తు నీటిలోపడి మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ధర్పల్లి మండలం చల్లగరిగె గ్రామానికి చెందిన సాయిలు కొంతకాలంగా డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం చేపలవేటకు వెళ్లిన అతడి నీటిలో మునిగి మృతి చెందాడు. సోమవారం ఉదయం పోలీసులు స్థానికుల సాయంతో చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి కుమారుడు సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

దోమకొండ: మండలంలోని చింతమాన్‌పల్లికి చెందిన రైతు నీల రాజయ్య(53) సోమవారం విద్యుత్‌షాక్‌తో మృతిచెందినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. గ్రామ శివారులోని లక్కాకుల భూమయ్యకు చెందిన వ్యవసాయభూమిని కౌలుకు తీసుకుని పంట సాగుచేస్తున్న రాజయ్య, వరి కోతకోసం హార్వెస్టర్‌ను తీసుకువచ్చాడు. దాని కోసం విద్యుత్‌వైర్లను తొలగించి, మళ్లీ సరి చేస్తుండగా షాక్ తగిలింది. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పెద్ద చెరువు కట్టకింద వ్యవసాయ క్షేత్రంలోని బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు 45–50 మధ్య ఉంటుందన్నారు. మృతుడిని ముస్లిం మతానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

మృతురాలి గుర్తింపు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఆదివారం లభించిన మృతదేహం చాకలి బుర్రి కీర్తన(19)గా గుర్తించారు. ఈ మేరకు ట్రెయినీ ఎస్పీ కాజల్ ఆధ్వర్యంలో సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు, తహసీల్దార్ సతీశ్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. మృతురాలి భర్త బుర్రి విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఏడుగురిపై పిచ్చి కుక్క దాడి

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో సోమవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ఏడుగురిపై దాడి చేసి గాయపర్చింది. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో దారివెంట వెళ్తున్న వ్యక్తులపై పిచ్చికుక్క దాడి చేసింది. బాధితులకు ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది చికిత్స చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

తాడ్వాయి/లింగంపేట(ఎల్లారెడ్డి): ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనల్లో ఐదుగురికి గాయాలయ్యాయి. తాడ్వాయి మండలం క్రిష్టాజివాడి శివారులో, లింగంపేట మండలం గాంధీనగర్ మూలమలుపు వద్ద సోమవారం ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్నాయి. క్రిష్టాజివాడికి చెందిన తొడెంగల స్వామి తన భార్యశైలజతో కలసి పింఛన్ తీసుకోవడానికి బైక్‌పై శివారులోని గుడికి వెళ్తుండగా, చిన్న మల్లారెడ్డికి చెందిన సురేశ్ అనే వ్యక్తి బైక్‌పై కామారెడ్డి నుంచి క్రిష్టాజివాడికి వస్తున్నాడు. ఈ క్రమంలోఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ముగ్గురికి తీవ్రగాయాలు కాగా కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ బాధితులను పరామర్శించారు.

మోహన్‌రెడ్డి అనే వ్యక్తి బైక్‌పై కామారెడ్డి నుంచి ఆత్మకూర్‌కు వెళ్తుండగా, కొయ్యగుండు తండా నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న బన్సీఅనే వ్యక్తి బైక్‌లు లింగంపేట మండలంలోని గాంధీనగర్ వద్ద మూలమలుపు ఎదురెదురుగా ఢీకొన్నాయి. గాయాలపాలైన ఇరువురిని పోలీసులు కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

టాటా ఏస్ బోల్తాపడిన ఘటనలో..

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం టాటాఏస్ వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్ గ్రామానికి చెందిన రాజమ్మ, ఎల్లయ్య దంపతులు బంధువులతో కలిసి మెట్‌పల్లిలో శుభకార్యానికి వెళ్తుండగా, అర్గుల్ శివారులో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, పదిమందికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధాన్యం కుప్పను ఢీకొన్న ఘటనలో..

డిచ్‌పల్లి: మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామ శివారులో రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్పను బైక్ ఢీకొన్న ఘటనలో అమృతాపూర్‌కు చెందిన కుందేటి శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలైనట్లు ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. ఆదివారం డిచ్‌పల్లి ఖిల్లాలోని అమ్మమ్మ ఇంటికి వచ్చిన శ్రీకాంత్ రాత్రికి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై వినయ్

వేల్పూర్: నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు బాల్కొండ, వేల్పూర్, భీమ్‌గల్ మండలాల యువతకు గంజాయి సరఫరా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను వేల్పూర్ ఎస్సై వినయ్ వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం సిబ్బందితో కలిసి వెంకటపూర్ రోడ్డులో పోలీసులు సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి బైక్‌ను ఆపి తనిఖీ చేయగా 2 కిలోల 100గ్రాముల గంజాయి పట్టుబడింది. నిర్మల్‌కు చెందిన సయ్యద్ అజీమ్, షేక్ అద్నాన్ సోహెల్ మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి, సిబ్బంది విజయ్, సందీప్, శ్రావణ్, భరత్ పాల్గొన్నారు .

పింఛన్ కోసం వస్తూ..


అంజవ్వ (ఫైల్)

పెద్దకొడప్‌గల్(జుక్కల్): బైక్ అదుపు తప్పిన ఘటనలో చిన్న దేవాడకు చెందిన కుర్మ అంజవ్వ మృతి చెందింది. కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న అంజవ్వ పింఛన్ కోసం సోమవారం కొడుకు బైక్‌పై వస్తుండగా, ఎలకంటి చెరువు సమీపంలో ప్రమాదం జరిగింది. అంజవ్వ ఘటనాస్థలంలోనే మృతి చెందగా, ఆమె కుమారుడు యాదిగొండకు స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలి కూతురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

పింఛన్ తీసుకొని వెళ్తూ..

ఎడపల్లి(బోధన్): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో మండలంలోని ఠానాకలాన్‌కు చెందిన మెట్టు భూమయ్య(60) మృతి చెందాడు. ఈ ఘటన ఎమ్మెస్సీ ఫారం వద్ద చోటుచేసుకుంది. వ్యవసాయ కూలీ అయిన భూమయ్య టీవీఎస్ మోపెడ్‌పై ఎడపల్లికి వచ్చి పింఛన్ తీసుకొని వెళ్తుండగా, నిజామాబాద్ వైపు నుంచి అతివేగంతో వచ్చిన కారు ఎమ్మెస్సీ ఫారం వద్ద ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన భూమయ్య ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. మృతుడి కొడుకు నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.